

## పంటు రాకపోకలు ప్రారంభం

ప్రజాశక్తి - నరసాపురం

వశిష్ట గోదావరిపై నరసాపురం-సఖినేటిపల్లి నడుమ పంటు రాకపోకలు సోమవారం ప్రారంభమయ్యాయి. గత నెల 21న వరద ఉధృతి కారణంగా పంటు రాకపోకలు నిలిపివేసిన సంగతి తెలిసిందే. దాదాపు 15 రోజులు పంటు నిలిపివేయడంతో ఉభయగోదావరి జిల్లాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రతిరోజూ ఉదయం ఏడు గంటల నుండి సాయంత్రం ఏడు గంటల వరకూ పంటు రాకపోకలు సాగుతాయని నరసాపురం ఇన్‌ఛార్జి ఎంపిడిఒ కె.వీరభద్రరావు తెలిపారు.



తిరుగుతున్న పంటు

# బీమా ఉన్నట్టా.. లేనట్టా..!

పంటల బీమాపై రైతుల్లో ఆందోళన

విధివిధానాలు ప్రకటించని ప్రభుత్వం

దెబ్బతిన్న నాట్లకు బీమా అందేనా?

దాదాపు మూడున్నర లక్షల ఎకరాల్లో వరిసాగు

రెండు జిల్లాల్లో వరదలకు 32 వేల ఎకరాల్లో వరి పంటకు దెబ్బ

కౌలురైతులకు కోలుకోలేని నష్టం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్ సాగుకు పంటల బీమా ఉన్నట్టా.. లేనట్టా అర్థం కాని పరిస్థితి నెలకొంది. కొత్త ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు గడుస్తున్నా పంటల బీమాకు సంబంధించి ఎటువంటి విధివిధానాలూ ప్రకటించ లేదు. దీంతో వరదలకు దెబ్బతిన్న ఖరీఫ్ పంటలకు బీమా వర్తిస్తుందో, లేదో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు మూడున్నర లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టారు. 50 శాతం నాట్లు పూర్తయ్యే సరికి పెద్దఎత్తున వర్షాలు, గోదావరి వరదలు విరుచుకుపడ్డాయి. దీంతో రెండు జిల్లాల్లో దాదాపు 32 వేల ఎకరాల్లో వరినాట్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇంకా వేలాది ఎకరాల్లో నాట్లు 50 శాతానికిపైగా దెబ్బతిన్న పరిస్థితి ఉంది. గత ప్రభుత్వం ఇ-క్రాప్‌లో నమోదైన రైతుల పేరిట పంటబీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించేది. దీంతో ప్రతియేటా పంటలబీమా ఇ-క్రాప్ ఆధారంగా సాగేది. ప్రభుత్వం మారింది. టిడిపి కూటమి అధికారం చేపట్టింది. ఇప్పటి వరకూ పంటల బీమాపై ఏవిధంగా ముందుకు సాగనుందో ప్రభుత్వం తేల్చలేదు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన అమలు చేస్తారా.. లేక ప్రభుత్వమే బీమా చెల్లింపులు చేసేలా నిర్ణయం తీసుకుంటుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వ హయాంలో కొనసాగుతున్న బీమా పాలసీనే కొనసాగిస్తుందో, లేదో కూడా చెప్పలేదు. దీంతో పంటల బీమాపై సందిగ్ధత నెలకొంది. బీమా ప్రీమియం ప్రభుత్వం చెల్లించనున్నట్లు ఎక్కడా చెప్పలేదు. దీంతో ఖరీఫ్‌లో దెబ్బతిన్న పంటలకు బీమా పరిహారం వస్తుందా అనే చర్చ రైతుల్లో సాగుతోంది. బీమాపై ఇప్పటికైనా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

**కౌలురైతులకు మేలు చేసేలా బీమా పాలసీ అమలయ్యేనా?**

రెండు జిల్లాల్లో దాదాపు మూడు లక్షల మంది కౌలురైతులు ఉన్నారు. జిల్లా వ్యవసాయ సాగులో 75 శాతం కౌలురైతులే చేస్తున్నారు. వైసిపి ప్రభుత్వం 2019లో చేసిన కౌలుచట్టంలో మార్పులతో కౌలురైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. భూయజమాని అంగీకారంతోనే కౌలుకార్డులు అందించాలనే నిబంధనతో పరిస్థితి దారుణంగా తయారైంది. భూయజమానులు ససేమిరా అంటుండటంతో కౌలుకార్డులు జారీ అంతంతమాత్రంగా మారింది. దీంతో ఇ-క్రాప్‌లో భూయజమానుల పేర్లే నమోదు చేస్తున్నారు. దీంతో దెబ్బతిన్న పంటలకు పరిహారంగాని, బీమా పరిహారంగాని, ప్రభుత్వం అందించిన రైతుభరోసాగాని ఏఒక్కటీ కౌలురైతులకు అందని పరిస్థితి నెలకొంది. పండించిన ధాన్యం సైతం తన పేరున అమ్ముకోలేని దుస్థితి ఉంది. టిడిపి కూటమి ప్రభుత్వం కౌలురైతులకు మేలు చేసేలా చర్యలు తీసుకోవాలని, కౌలుచట్టంలో మార్పులు చేయాలని, భూయజమాని అంగీకారంతో సంబంధం లేకుండా సాగు చేస్తున్న కౌలురైతులకు కార్డులు జారీ చేయాలని



రైతులు కోరుతున్నారు. ఇ-క్రాప్‌లో కౌలురైతుల పేర్లు నమోదు చేసి బీమా పరిహారం అందేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఇప్పటి వరకూ పంటల బీమా పాలసీకి సంబంధించి విధివిధానాలను ప్రభుత్వం ప్రకటించలేదు. కౌలురైతులకు అనుకూలంగా పంటల బీమా ఉండాలని అంతా కోరుతున్నారు. ప్రభుత్వం అందించే సాయం మొత్తం భూయజమానికి వెళ్లిపోతుండటంతో సాగు చేసిన కౌలురైతులు అప్పుల పాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ప్రభుత్వం వెంటనే పంటల బీమా పాలసీ ప్రకటించి కౌలురైతులను ఆదుకునే చర్యలు చేపట్టాల్సి ఉంది.



జిల్లా జాయింట్ కలెక్టర్ వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు గోపాలన్

## కదంతొక్కిన స్కీమ్ వర్కర్లు, చిరుద్యోగులు

### రాజకీయ వేధింపులు, తొలగింపులు ఆపాలని కలెక్టరేట్ వద్ద ధర్నా, ర్యాలీ

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వ రంగంలో పని చేస్తున్న చిరుద్యోగులు, స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు, తొలగింపులు ఆపాలని సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్.గోపాలన్, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ డి.కళ్యాణి మాట్లాడుతూ రాష్ట్రంలో అంగన్వాడీ, ఆశాలు, మధ్యాహ్న భోజన కార్మికులు, విఒఎలు, ఆర్‌పిలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మున్సిపల్ తదితర రంగాల్లో లక్షలాది మంది చిరుద్యోగులు, స్కీమ్ వర్కర్లు పని చేస్తున్నారన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వీరందరిపై స్థానిక రాజకీయ నాయకుల వేధింపులు పెరిగిపోయాయన్నారు. పని ప్రాంతాలకు, ఇళ్లకు వెళ్లి స్కీమ్ వర్కర్లను తప్పుకోవాలని బెదిరిస్తున్నారని ఆరోపించారు. తప్పుడు ఆరోపణలతో ఫిర్యాదులు చేస్తూ వారిని తొలగించాలని అధికారులపై ఒత్తిడి చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే రాష్ట్రంలో అనంతపురం జిల్లాలో 670 మంది మధ్యాహ్న భోజన కార్మికులను తొలగించారని, పల్నాడు జిల్లాలో 52 మంది మున్సిపల్ కార్మికులను ఆపోమని చెప్పారని తెలిపారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని రాజకీయ వేధింపులు ఆపించాలని వారు కోరారు. తొలుత విస్సాకోడేరు వంతెన వద్ద నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ధర్నాలో రాజకీయ వేధింపులు, తొలగింపులు ఆపాలని, స్కీమ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని నినదించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయులు, జవ్వాది శ్రీనివాస్, అంగన్వాడీ యూనియన్ నాయకులు ఎమ్‌డి.హాసీనా బేగం, ఎం.విజయలక్ష్మి, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు చింతపల్లి లక్ష్మి, లారెన్స్ కుమారి, మున్సిపల్ వర్కర్స్ నాయకులు బి.వరలక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్ నాయకులు ఎస్.భవాని, డి.వెంకటేశ్వర్లు, సిఐటియు నేత దేవ సుధాకర్ తదితరులు నాయకత్వం వహించారు.



సచివాలయ ఇన్‌ఛార్జి కార్యదర్శికి వినతిపత్రాన్ని అందజేస్తున్న నేతలు

## ఇసుక సమస్య పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - తణుకు

బ్లాక్ మార్కెట్లో కొనసాగుతున్న ఇసుక దందాను అధికార యంత్రాంగం తక్షణం స్పందించి నియంత్రించాలని, ఉచితంగా ఇసుక సరఫరా చేయాలని వేల్పూరు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు బళ్ల చినవీరభద్రరావు డిమాండ్ చేశారు. ఇసుక సమస్య పరిష్కరించాలని సోమవారం వేల్పూరులోని సచివాలయ నెం.2 వద్ద బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సచివాలయ ఇన్‌ఛార్జి కార్యదర్శి జి.తులసిప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉచిత ఇసుక సరఫరా చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చినప్పటికీ ఎక్కడా ఉచిత ఇసుక సరఫరా చేయడం లేదన్నారు. మళ్లీ పెరిగిన ఇసుక దళారీల నుండి బ్లాక్ మార్కెట్లో ప్రస్తుతం కొనసాగుతున్న మూడు యూనిట్ల ధర రూ.13 వేలు చెల్లించి కొనుగోలు చేయలేక ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి లబ్ధిదారులకు నెలకొందన్నారు. ఇసుక కోసం ప్రజానీకం పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతమన్నారు. స్టాక్ పాయింట్లలో ఇసుక నిల్వలు లేకపోవడంతో ఇసుక కోసం నానాతంటాలు పడాల్సి వస్తుందన్నారు. ఇదే అదునుగా ప్రయివేట్ ఇసుక దందా విచ్చలవిడిగా పేట్రేగి గతం కంటే ఎక్కువ ధర చెల్లిస్తే తప్ప ఇసుక దొరికే పరిస్థితి లేకుండా పోయిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గత నెలలో ఉచిత ఇసుక పాలసీ ప్రకటించిన స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక అమ్మకం ధర నిర్ణయించినప్పటికీ బ్లాక్‌లో అధిక ధరలకు అమ్మకాలు జరుపుతున్న వారిపై ఎటువంటి చట్టపరమైన చర్యలూ తీసుకోవడం లేదని విమర్శించారు. పెరిగిన ధరకు ఇసుక కొనుగోలు చేయలేక భవన నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోవడం వల్ల కార్మికులకు ఉపాధి లేకుండా పోతుందని తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఎన్నికల ముందు ఇచ్చిన ఉచిత ఇసుక హామీని అమలు చేయాలని వీరభద్రరావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు ఎర్ర మల్లికార్జునరావు, వాటాల నాగేశ్వరరావు, తిరుమాని వెంకటేశ్వరరావు, సోరపల్లి రామకృష్ణ, యాతం పెద్దిరాజు, ఆనందం గంగాధరరావు, లంకె శ్రీనివాస్, బొక్కా మోహన్‌రావు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీల బకాయి వేతనాలు చెల్లించాలి

### డిఆర్‌ఒ, డ్వామా పీడీలకు వినతి

ప్రజాశక్తి - భీమవరం

ఉపాధి హామీ కూలీల వేతన బకాయిలు జిల్లాలో రూ.48 కోట్లు వెంటనే విడుదల చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ కోరింది. సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మీకోసం కార్యక్రమంలో డిఆర్‌ఒకు, ఉపాధి హామీ కార్యాలయంలో డ్వామా పీడీ ప్రభాకర్‌కు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాతిరెడ్డి జార్జి, జక్కంశెట్టి సత్యనారాయణ, నేత కౌరు పెద్దిరాజు మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు పని చేసిన 15 రోజుల్లో వేతనం ఇవ్వాలని చట్టం చెబుతున్నా కేంద్ర ప్రభుత్వం దానికి తూట్లు పొడిచి 70 రోజులైనా వేతనాలు ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. ఒకపక్క పని దినాలు పెంచామంటూ మరోపక్క కేంద్ర బడ్జెట్‌లో నిధులు తగ్గించడం కూలీలను మోసగించడమేనన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో పది వారాల నుండి ఆరు వారాల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు.



డ్వామా పీడీ ప్రభాకర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

మరోపక్క ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ వేధింపులు పెరిగాయని వాటిని నివారించాల్సిన బాధ్యత జిల్లా అధికారులపై ఉందన్నారు. బకాయి వేతనాలను అందించడంతోపాటు పని దినాలు 200 రోజులకు పెంచాలని, కనీస వేతనం రూ.600 ఇవ్వాలని, తొలగించిన పనులను వెంటనే చేర్చాలని, ఆన్‌లైన్ మస్తర్ విధానాన్ని తొలగించి పాత పద్ధతిలో పనులు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శేషపు అక్రియ్య, ఎడ్ల చిట్టిబాబు, గుబ్బల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎల్‌ఎ పితాని సోదరుడు సూర్యనారాయణ మృతి

### స్వగ్రామ కొమ్ముచిక్కాలలో విషాదఛాయలు

ప్రజాశక్తి - పాలకొల్లు/పోడూరు

ప్రముఖ పారిశ్రామికవేత్త, లేస్ వ్యాపారి పితాని సూర్యనారాయణ (78) సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణకు ఆయన స్వయానా సోదరుడు. సూర్యనారాయణకు భార్య, కుమారుడు, ఇరువురు కుమార్తెలు ఉన్నారు. పెనుగొండ డిగ్రీ కళాశాల పాలకవర్గ అధ్యక్షులుగా కూడా ఉన్నారు. స్వగ్రామం కొమ్ము చిక్కాలలో దారాల పరిశ్రమ నెలకొల్పి ఎందరికో ఉపాధి కల్పించారు. సూర్యనారాయణ భౌతికకాయాన్ని ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణతోపాటు నరసాపురం ఎంపీ బొమ్మిడి నాయకర్, మాజీ ఎంఎల్‌ఎలు బండారు మాధవనాయుడు, అల్లు వెంకట సత్యనారాయణ, మాజీ ఎంఎల్‌సిలు మేకా శేషుబాబు, అంగర రామ్మోహన్, తెలంగాణ రిటైర్డ్ చీఫ్ సెక్రటరీ సోమేష్‌కుమార్, శెట్టిబలిజ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ గుబ్బల తమ్మయ్య, పోడూరు జెడ్‌పిటిసి గుంటూరు పెద్దిరాజు, వివిధ పార్టీల నేతలు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, కలవకొలను తులసీరావు, పెచ్చెట్టి బాబు, కలవకొలను తాతాజీ, కోడి విజయభాస్కర్ సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కొమ్ముచిక్కాలలో సోమవారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు.



నివాళులర్పిస్తున్న తెలంగాణ రిటైర్డ్ సిఎస్ సోమేష్‌కుమార్

పెనుగొండ: ఎస్‌వికెపి డాక్టర్ కెఎస్.రాజు ఆర్ట్స్ అండ్ సైన్స్ అటానమస్ కళాశాల పాలకవర్గ అధ్యక్షులుగా, ఆంధ్రా యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా, పారిశ్రామికవేత్తగా సుదీర్ఘ సేవలందించిన పితాని సూర్యనారాయణ హఠాన్మరణం బాధాకరమని ఆ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కలిదిండి రామచంద్రరాజు, ప్రిన్సిపల్ డాక్టర్ వైవి.అప్పారావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కెవిఆర్.సూర్యనారాయణ తెలిపారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సూర్యనారాయణ 2002వ సంవత్సరం నుంచి కళాశాల పాలకవర్గ అధ్యక్షులుగా.. కళాశాల అభివృద్ధిలో ప్రముఖ పాత్ర వహిస్తూ కళాశాల దినదినాభివృద్ధి చెందడంలో కీలకమైన పాత్ర పోషించారన్నారు.

## కౌలురైతులకు విత్తనాలివ్వకపోవడం దారుణం

### ఎపి కౌలురైతుల సంఘం విమర్శ

ప్రజాశక్తి - భీమవరం

నారుమళ్లు, వరినాట్లు నష్టపోయిన వాస్తవ సాగుదారులైన కౌలురైతులకు విత్తనాలు ఇవ్వకుండా రైతుసేవా కేంద్రాలకు వచ్చి వేలిముద్రలు వేసిన భూయజమానులకు మాత్రమే విత్తనాలు ఇవ్వాలని ప్రభుత్వం చెప్పడం దారుణమని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు విమర్శించారు. భూయజమానులతో సంబంధం లేకుండా పంట నష్టపోయిన కౌలురైతులను గుర్తించి విత్తనాలు ఇవ్వాలని ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ నారాయణరెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయం నూటికి తొంభై శాతం కౌలురైతులే సాగు చేస్తున్నారన్నారు. ఇటీవల కురిసిన వర్షాలు, వరదలకు జిల్లాలో ప్రధానంగా ఆచంట, పోడూరు, యలమంచిలి, నరసాపురం, పాలకొల్లు, భీమవరం మండలాలతోపాటు అనేక మండలాల్లో వేలాది ఎకరాల్లో నారుమళ్లు, నాట్లు దెబ్బతిన్నాయన్నారు. దెబ్బతిన్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం 80 శాతం సబ్సిడీపై వరి విత్తనాలు ఇస్తున్నామని ప్రకటించిందన్నారు. ఆచంట వేమవరం తదితర ప్రాంతాల్లో విత్తనాల కోసం కౌలురైతులు వెళ్లగా మండల, గ్రామ వ్యవసాయాధికారులు కౌలురైతులకు ఇవ్వడం లేదని, కౌలు గుర్తింపు కార్డులున్నా ఇవ్వాలని తమకు ఆదేశాలు లేవని చెబుతున్నారన్నారు. దీనిపై ఇన్‌ఛార్జి జెసి నారాయణరెడ్డి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారన్నారు.



జెసికి వినతిపత్రం అందజేస్తున్న కౌలురైతుల సంఘం నాయకులు

## మాదకద్రవ్యాల మత్తులో యువత

### ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్లీనంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మోహన్‌రావు

ప్రజాశక్తి - ఆకివీడు

యువత మాదకద్రవ్యాలు, చెడువ్యసనాలకు బానిసలవుతోందని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మోహన్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. మంచిని ప్రోత్సహించి ఉత్తమ సమాజాన్ని నిర్మించడం కోసం విద్యార్థులు అన్యాయాన్ని ఎదిరించి సన్మార్గంలో నడవాలని ఆయన పిలుపునిచ్చారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్లీనం సోమవారం స్థానిక ఐఎంఎ హాల్లో జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రామ్మోహన్‌రావు మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయాలను పిల్లలు నిలబెట్టాలన్నారు. విద్యార్థులు తమ కాలేజీల్లో, స్కూళ్లలో ఉన్న సమస్యలపై చదువుతూనే పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. విద్య అనేది వ్యాపారంగా మార్చారని, కార్పొరేట్ విద్యను ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయని అన్నారు. ఎయిడెడ్ కాలేజీల జిఒ నెం.35ను వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా కె.ఈశ్వర్, జిల్లా కార్యదర్శిగా డి.ప్రసాద్‌తోపాటు మరో 22 మందితో జిల్లా కమిటీ ఎన్నికైంది. సమావేశంలో పి.వాసు, ఎమ్‌డి.జాన్, సిహెచ్.శాంతి, పి.శిరీషా, కె.సింధు, ఎం.పవిత్ర, కె.యశ్వంత్, బి.గణేష్, జి.శ్రీను, ఎస్.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించింది.

నర్సాపురంలోని ఆక్వా యూనివర్సిటీకి అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాలని, కార్పొరేట్, ప్రయివేటు సంస్థల విద్యా వ్యాపారాన్ని అరికట్టాలని సమావేశం తీర్మానించింది. విద్యాహక్కు బలంగా ఉన్న చట్టాన్ని అమలు చేయాలని, సంక్షేమ హాస్టళ్లకు శాశ్వత భవనాలు ఏర్పాటు చేయాలని, విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్స్ ఇవ్వాలని, మాదకద్రవ్యాలపై అవగాహనా కార్యక్రమాలు, వీధి నాటికలు, సోషల్ అవేర్‌నెస్ కార్యక్రమాలు జిల్లావ్యాప్తంగా 200 నుంచి 150 సెంటర్లలో నిర్వహించాలని సమావేశం నిర్ణయించారు.



నూతనంగా ఎన్నికైన ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ

## వయనాడ్ బాధితులను ఆదుకోవాలి

### సిపిఎం ఆధ్వర్యాన విరాళాల సేకరణ



బలరాంకు విరాళం అందజేస్తున్న కనుమూరు రామకృష్ణంరాజు-కావ్యల కుమార్తె సహస్ర

ప్రజాశక్తి - పెంటపాడు

కేంద్ర ప్రభుత్వం కేరళ వరద బాధితులను ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి, నాయకులు బంకురు నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం కేరళ రాష్ట్రం వయనాడ్ వరద బాధితుల సహాయార్థం నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30వ తేదీన వయనాడ్‌లో భారీ వర్షానికి కొండ చర్యలు విరిగిపడి సుమారు 300 మంది మృతి చెందారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దీన్ని జాతీయ విపత్తుగా ప్రకటించి కేరళ ప్రభుత్వాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెనగంటి దుర్గ, తాడి బాలయ్య, దూలం ప్రసాద్, వడ్డాది సన్యాసిరావు, ధన బాబు, సత్తి సుబ్బిరెడ్డి, వెలగల నాగిరెడ్డి మేడపాటి జనార్ధన్‌రెడ్డి, కృష్ణ అమ్మిరెడ్డి పాల్గొన్నారు.

**భీమవరం:** ఆకివీడు మండలం కోళ్లపర్రు (రాజులపేట)కు చెందిన కనుమూరు రామకృష్ణంరాజు-కావ్య కుమార్తె సహస్ర కేరళ వయనాడ్ బాధితుల సహాయార్థం రూ.5,000 సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాంకు సిపిఎం కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ చిన్నారి సహస్రను ఆయన అభినందించారు.

**భీమవరం టౌన్ :** వయనాడ్ బాధితులను ఆదుకోవాలని సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ తెలిపారు. వెంప గ్రామంలో సోమవారం బస్టాండ్ సెంటర్లో సిపిఎం ఆధ్వర్యాన విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ వంతు విరాళాలు ఇచ్చి నిరాశ్రయులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు తిరుమాని నాగేశ్వరరావు, పొన్నమండ నాగేశ్వరరావు, వేగి మోహన్‌రావు పాల్గొన్నారు



పెంటపాడు : విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నేతలు

## 11 ఫిర్యాదుల స్వీకరణ

**తాడేపల్లిగూడెం:** తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 11 ఫిర్యాదులు వచ్చాయని మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ తెలిపారు. వాటిలో టౌన్ ప్లానింగ్ - 9, రెవెన్యూ-1, పబ్లిక్ హెల్త్ 1 మొత్తం 11 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. వాటిని ఆయా శాఖల ద్వారా పరిష్కరిస్తామని కమిషనర్ తెలిపారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


**పాలకొల్లు :** స్థానిక ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్య, పొగాకు వినియోగం వల్ల కలిగే దుష్ఫలితాలపై రసాయనశాస్త్ర విభాగం, పాలకొల్లు స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో సంయుక్తంగా అవగాహనా సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ టి.రాజరాజేశ్వరి మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కళాశాల మాదకద్రవ్య వ్యతిరేక కమిటీ కో కన్వీనర్ వంశీ మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగానికి చెందిన డాక్టర్ రామకృష్ణ, విడివి.లక్ష్మి, రసాయన శాస్త్ర విభాగ అధిపతి పాల్గొన్నారు.

## ఉన్నత చదువులకు లక్ష్యం ముఖ్యం

### జెఎన్‌టియుకె విసి మురళీకృష్ణ

ప్రజాశక్తి - నరసాపురం

ఉన్నత చదువులకు లక్ష్యం చాలా ముఖ్యమని, దాన్ని సాధించాలంటే కొన్ని త్యాగం చేయక తప్పదని కాకినాడ జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ మురళీకృష్ణ అన్నారు. మండలంలోని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. చాలామంది విద్యార్థులు మద్యం, గంజాయి వంటి మాదకద్రవ్యాలకు బానిసలై మంచి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. తల్లిదండ్రులు పిల్లల నడవడికను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. సెల్‌ఫోన్లకు బానిస కాకుండా చూడాలన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులు దీనికి దూరంగా ఉన్నప్పుడే జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోగలమన్నారు. చదువు, జ్ఞానం, విజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు తోటి విద్యార్థులతో షేర్ చేసుకుంటూ ఉండాలన్నారు. అప్పుడే కొత్త ఆలోచనలు, అంశాలను సులభంగా అర్థం చేసుకోగలరన్నారు. ప్రతి క్షణం వృథా చేయకుండా చదవాలన్నారు. ఇంజినీరింగ్ అంటే ఒక పరిశోధన అని, నిత్యం చేతులకు, మెదడుకు పని పెడుతున్నప్పుడే అవి చురుగ్గా పని చేస్తాయన్నారు. అనంతరం విసిని కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ కెవి.సత్యనారాయణ, కోశాధికారి కొండేటి త్రినాధ్, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపల్ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విసిని సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం


కుళాయి చెరువును పరిశీలిస్తున్న నాయకర్

## ఎంఎల్‌ఎచే కుళాయి చెరువు పరిశీలన

**ప్రజాశక్తి - నరసాపురం**

మండలంలోని తూర్పుతాళ్ళు గ్రామంలో తాగునీటి కుళాయి చెరువును నరసాపురం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ సోమవారం పరిశీలించారు. కుళాయి చెరువు గట్టు వెంబడి తిరిగి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తీర ప్రాంతం కావడంతో ఉప్పు నీరు వస్తోందని, చెరువు వాటర్ లెవెల్ పెరగడం లేదని, తాగునీటి సమస్య ఉందని గ్రామస్తులు ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకొచ్చారు. సమస్యను పరిష్కరించాలని ఎంఎల్‌ఎ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆకన చంద్రశేఖర్, వలవల నాని, కడలి పద్మారావు, పులపర్తి సత్యనారాయణ, బళ్ల హనుమంతు, గంట కృష్ణ పాల్గొన్నారు.

## ఆడపిల్లలను చదివించాలి

**ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం**

ఆడపిల్లలను చదివించాలని, చిన్న వయసులో పెళ్లి చేయరాదని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు విశాలాక్షి, దుర్గ భవానీ తెలిపారు. స్థానిక సుబ్బారావు పేట 5వ వార్డు అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం బాల్య వివాహాలపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వం ఆడపిల్లలకు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఐదో వార్డు గ్రామ సచివాలయం మహిళా పోలీస్ ప్రశాంతి మాట్లాడుతూ చదువు ఆవశ్యకత పట్ల అవగాహన లేకపోవడం వల్ల చిన్న వయసులోనే బడి మానేసి ఇంటి వద్ద ఉంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో పిల్లలకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ఆడపిల్లలు చదువుకునేలా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. భవిత కేంద్రం ప్రధానోపాధ్యాయిని బి.జ్యోతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆడ పిల్లలను గౌరవించాలన్నారు. భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయుడు ఎస్‌కె బాల ఈశ్వరయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో 5వ వార్డు అంగన్వాడీ కేంద్రం టీచర్ సత్యవతి, రత్నకుమారి, ఉపాధ్యాయిని కె.కుమారి, ఆశా వర్కర్ పూర్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

## 388 మందికి కంటి పరీక్షలు


**ప్రజాశక్తి - గణపవరం**

జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమం సందర్భంగా సోమవారం స్థానిక పిహెచ్‌సి ఆధ్వర్యాన జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్లో 388 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్ బాబు తెలిపారు. పరీక్షలు చేసిన వారిలో 75 మందికి కంటి సమస్యలు ఉన్నట్లు తెలిపారు. వారికి ప్రభుత్వం ఉచితంగా కళ్లజోళ్లు అందజేస్తోందని చెప్పారు. కంటి సమస్యలు నివారణకు ఆకు కూరలు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం బాల భాస్కరరావు, ఎంఎల్‌హెచ్ పాప పాల్గొన్నారు.

## సమయాన్ని సద్వినియోగం చేసుకోండి

**ప్రజాశక్తి - వీరవాసరం**

ఇంటర్మీడియట్ విద్యార్థి దశ విద్యార్థులకు ఎంతో కీలక దశ అని, ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటేనే ఉన్నత చదువులకు బాట ఏర్పడుతుందని ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని అన్నారు. ప్రభుత్వ ఉచిత పుస్తకాలను వీరవాసరం విఇసి జూనియర్ ప్రభుత్వ కళాశాల, రాయకుదురు ప్లస్ హైస్కూల్ విద్యార్థులకు సోమవారం అందజేశారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ చాబత్తుల ప్రభువరం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథి జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్ నాయుడు మాట్లాడుతూ గతంలో ఈ కళాశాల ఎంతో పేరు ప్రఖ్యాతలు గాంచిందన్నారు. నాటి కళాశాల పూర్వవైభవాన్ని తీసుకురావడానికి అధ్యాపకులు, విద్యార్థులు కృషి చేయాలన్నారు. ఎంపిపి మాట్లాడుతూ గంజాయి వంటి వ్యసనాలకు లోనుకాకుండా విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ఎం.శ్రీమన్నారాయణ, అధ్యాపకులు ఎన్.సురేష్, బిజెపి మండల అధ్యక్షుడు కోడి నరసింహారావు, ఎంపిటిసి యాళ్లబండి ఇందిర, విద్యార్థులు పాల్గొన్నారు.


వీరవాసరంలో విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఎంపిపి, జెడ్‌పిటిసిలు

## ప్రముఖ దాత భీమరాజు కన్నుమూత

**ప్రజాశక్తి - భీమవరం టౌన్**

ప్రముఖ దాత బుద్ధరాజు భీమరాజు (99) సోమవారం ఆయన నివాసంలో కన్నుమూశారు. ఆయన గతంలో రోడ్లు భవనాల శాఖలో పనిచేసి రిటైర్డ్ అయ్యారు. ఆయన నివాసం ఉండే శివరావుపేటలో ఎంతోమంది నిరుపేదలకు ఆపన్న హస్తం అందించడమే కాకుండా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే స్థానిక రామాలయం అభివృద్ధికి విశేష కృషిచేశారు. కష్టాల్లో ఉన్న వారిని ఆదుకునే వ్యక్తిత్వం ఉన్న భీమరాజు మృతి పట్ల పలువురు పట్టణ ప్రముఖులు సంతాపం తెలిపారు. భీమవరం ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు భీమరాజు భౌతికకాయానికి నివాళులర్పించారు. భీమరాజు అల్లుడు ప్రముఖ జనసేన నాయకుడు చింతలపాటి బంగారాజును కలిసి పట్టణ ప్రముఖులు సంతాపం తెలిపారు.


భీమరాజు (ఫైల్‌ఫొటో)


నినాదాలు చేస్తున్న ఎస్‌టియు నాయకులు

## ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

**ప్రజాశక్తి - కాళ్ల**

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఎస్‌టియు కృషి చేస్తోందని ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా ఫ్యాప్టో ఛైర్మన్ సాయి వర్మ అన్నారు. జక్కరం మెయిన్ ప్రాథమిక పాఠశాలలో సంఘం మండల అధ్యక్షు లు పాపారావు అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా ఫ్యాప్టో ఛైర్మన్ సాయి వర్మ మాట్లాడుతూ 2003 డిఎస్‌సి వారిని తక్షణం పాత పెన్షన్ విధానంలోకి తేవాలన్నారు. 2008 ఎంటిఎస్ టీచర్లను రెగ్యులర్ చేయాలని, 2 పిఎఫ్ బ్యాలెన్స్ షీట్లను అప్‌డేట్ చేసి ఆన్‌లైన్లో పెట్టాలన్నారు. కాళ్ల మండల ప్రధాన కార్యదర్శి గణేష్ మాట్లాడుతూ సమస్యలన్నింటినీ ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు సాయి శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు జనార్ధన్‌రావు, ఎస్‌టియు విద్యా పరిరక్షణ రాష్ట్ర కమిటీ సభ్యులు జానకీ రామరాజు, సంఘం మండల సభ్యులు మోహన్‌బాబు, శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, నాగప్రసాద్, పి.ప్రసాద్ పాల్గొన్నారు.

## కోళ్ల పెంపకంపై శిక్షణ

**ప్రజాశక్తి - ఉండి**

కోళ్ల పెంపకంపై ఇచ్చే శిక్షణా కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 6, తొమ్మిదవ తేదీల్లో కృషి విజ్ఞాన కేంద్రంలో పశుసంవర్ధక శాఖ అధికారుల పర్యవేక్షణలో కోళ్ల పెంపకంపై శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. కోళ్ల పెంపకాన్ని చిన్న తరహా కుటీర పరిశ్రమగా భావించి రైతులు, గ్రామీణ యువత, మహిళలు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



# అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు : ఇఒపిఆర్‌డి

**ప్రజాశక్తి - ఆచంట**

లంక గ్రామాల్లో వరదలు తగ్గడంతో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఇఒపిఆర్‌డి టి.మూర్తిబాబు అన్నారు. సోమవారం మండలంలోని పెదమల్లం లంక, ఆనగార్లలంక, పల్లెపాలెం, అయోధ్యలంక, పుచ్చల్లంక, మర్రి మూల, రాయిలంక, పెదపేట, భీమలాపురం, కాపులపాలెం గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా ముగ్గు, బ్లీచింగ్‌తో పాటు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు లంక గ్రామాల్లో పర్యటించి అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఇఒపిఆర్‌డి మూర్తిబాబు మాట్లాడుతూ లంక గ్రామాల్లో ప్రజలు అంటు వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. లంక గ్రామాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచులు కడలి కృష్ణవేణి వెంకటరెడ్డి, దిరిశాల విజయలక్ష్మి, గుబ్బల మాధవరావు పాల్గొన్నారు.

## రైతులకు విత్తనాలు అందజేత

**ప్రజాశక్తి - నరసాపురం**

అధిక వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. సోమవారం మండలంలోని చిట్టవరం, కొత్త నవరసపురం, సరిపల్లి, లిఖితపూడి, మల్లవరం, మల్లవరంలంక, కొప్పర్రు గ్రామాల్లో రైతులకు 80 శాతం సబ్సిడీపై వరి విత్తనాలను ఎంఎల్‌ఎ అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, ఆకన చంద్రశేఖర్, వలవల నాని, గంట కృష్ణ పాల్గొన్నారు.

**ఉండి:** రాయితీపై ప్రభుత్వం రైతులకు అందించే వరి విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.సంధ్య అన్నారు. సోమవారం ఉప్పులూరులో రైతు సేవా కేంద్రంలో వరి రైతులకు 80 శాతం రాయితీతో ఎంటియు 1153 రకం విత్తనాలు ఇస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామ సర్పంచి యర్రా దుర్గారావు మాట్లాడుతూ ఇటీవల కురిసిన అధిక వర్షాల వల్ల నారుమడులు దెబ్బతినడంతో అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని, స్పందించిన ప్రభుత్వం రాయితీపై వరి విత్తనాలు అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి నిమ్మల కేశవకుమార్, టిడిపి గ్రామ అధ్యక్షులు లోకం సుబ్బారావు, వ్యవసాయ సహాయకులు ఎం.మహేంద్ర, రైతులు పాల్గొన్నారు.

**యలమంచిలి :** యలమంచిలిలో సోమవారం రైతులకు ప్రభుత్వం తరపున అందించే సబ్సిడీ విత్తనాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభకు టిడిపి మండల అధ్యక్షులు మామిడిశెట్టి పెద్దిరాజు అధ్యక్షత వహించారు. సభలో మండల వ్యవసాయ అధికారి దేవి మాట్లాడుతూ ముంపునకు గురైన నారుమడులకు సంబంధించి మండలం మొత్తం మీద 168 ఎకరాలకు 677 క్వింటాళ్ల ఎంటియు 1153 రకం వరి విత్తనాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. 30 కేజీల బస్తా ధర రూ.1,134 కాగా, సబ్సిడీ రూ.907 పోను రైతుల వాటాగా రూ.277 కట్టాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బొప్పన హరికిషోర్, బోనం నాని, రత్నంరాజు, చిట్టి నాయుడు పాల్గొన్నారు.

## ముంపు పొలాల పరిశీలన

**ప్రజాశక్తి - ఆచంట**

మండలంలో ఆచంట, శేషమ్మచెరువు, పెనుమంచిలి, గ్రామాల్లో నీటమునిగిన పొలాలను మండల స్థాయి కమిటీలు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి తహశీల్దార్ డి.సుగుణ సంధ్య, ఇన్‌ఛార్జి మండల వ్యవసాయ అధికారి బి.నాగరాజు మాట్లాడుతూ మండలంలో ఇటీవల సంభవించిన వరదలు, వర్షాల కారణంగా పంట పొలాలు ముంపునకు గురయ్యాయని, నష్టపోయిన రైతులకు ఎన్యుమరేషన్ ప్రక్రియ వేగవంతం చేసి తుది జాబితాను రైతు సేవా కేంద్రాల్లో ప్రచురణ చేయాలని ఆదేశించారు. ఈ నెల తొమ్మిదో తేదీ వరకూ అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థాయి కమిటీ సభ్యులు, విఆర్‌ఒలు, పాల్గొన్నారు.

## ఐటిఐలో మూడో విడత అడ్మిషన్లు

**ఆచంట:** ఆచంటలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటిఐ) నందు 2024 - 2025 విద్యా సంవత్సరానికి గాను మొదటి, రెండో విడతల్లో మిగిలిన సీట్లకు మూడో విడత కౌన్సిలింగ్‌కు ap.gov. in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఇందుకూరి వెంకట సత్యనారాయణ రాజు సోమవారం విలేకరులకు తెలిపారు. ప్రభుత్వ ఐటిఐ ఆచంటలో చేరాలనుకునే విద్యార్థులు ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలను ఈనెల 26వ తేదీ సోమవారం సాయంత్రం ఐదు గంటల్లోపు కాలేజీలో అందజేయాలని సూచించారు. ఈ నెల 29వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు కౌన్సిలింగ్ జరుగుతుందని, ఈ కౌన్సిలింగ్‌కు అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకొని హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9490111002 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## మొగల్తూరు తహశీల్దార్‌గా విద్యాపతి

**ప్రజాశక్తి - మొగల్తూరు**

మొగల్తూరు మండల తహశీల్దార్‌గా సిహెచ్ విద్యాపతి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికలకు ముందు పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం తహశీల్దార్‌గా విధులు నిర్వహించారు. ఎన్నికల కోడ్‌లో భాగంగా కాకినాడకు బదిలీ అయ్యారు. ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం కాకినాడ నుంచి మొగల్తూరు తహశీల్దార్‌గా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి న్యాయమైన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ముందుగా తహశీల్దార్‌కు కార్యాలయ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు.


తహశీల్దార్‌గా విద్యాపతి

## అభివృద్ధికి నాగేశ్వరరావు కృషి

**ప్రజాశక్తి - మొగల్తూరు**

గ్రామ, సంఘం అభివృద్ధికి నాగేశ్వరరావు ఎనలేని కషి చేశారని మాజీ ఎంఎల్‌ఎ బండారు మాధవ నాయుడు అన్నారు. కాళీపట్నం పడమర గ్రామానికి చెందిన కడలి నాగేశ్వరరావు సోమవారం మృతి చెందారు. ఈ సందర్భంగా ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. నాగేశ్వరరావు కాళీపట్నం పడమర సర్పంచిగా, కల్లుగీత సొసైటీ అధ్యక్షుడిగా, నీటి సంఘం అధ్యక్షుడిగా సేవలందించారని తెలిపారు. మేడిది బాబ్జి, కవురు ఆదినారాయణ, పలువురు గ్రామస్తులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.


తహశీల్దార్ రవికుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

## పెనుమంట్ర తహశీల్దార్‌గా రవికుమార్

**పెనుమంట్ర:** ఎన్నికల బదిలీల్లో భాగంగా భీమవరం నుంచి కృష్ణా జిల్లా బంటుమిల్లి తహశీల్దార్‌గా వెళ్లిన వై.రవికుమార్ సోమవారం పెనుమంట్ర తహశీల్దార్‌గా విధుల్లో చేరారు. ఆయనకు స్థానిక కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

## గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

**మొగల్తూరు:** మండలంలోని పేరుపాలెం బీచ్‌లో గల్లంతైన యువకుడి మృతదేహం సోమవారం లభ్యమైందని ఎస్‌ఐ కె.వెంకటరమణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తణుకు పాత ఊరికి చెందిన కొల్లి జాన్‌బాబు (17) స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని తన మిత్రులతో కలిసి ఆదివారం పేరుపాలెం బీచ్‌కు వచ్చిన జాన్‌బాబు సముద్ర స్నానం చేస్తూ ప్రమాదవశాత్తూ లోపలికి కొట్టుకు వెళ్లి గల్లంతయ్యాడు. అతని ఆచూకీ కోసం గాలిస్తూ ఉండగా మొళ్లపర సమీపంలో మృతదేహం లభ్యమైందని ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసాపురంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## ముర్రిపాలతోనే వ్యాధి నిరోధక శక్తి

**ప్రజాశక్తి - మొగల్తూరు**

చిన్నారులకు ఆరు నెలల వరకూ తల్లిపాలు పట్టడంతో వారిలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని సిడిపిఒ బి.ఊర్మిళ అన్నారు. ముత్యాలపల్లి గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. చిన్నారికి తల్లిపాలు పట్టడంతో తల్లికి బిడ్డకి ఇరువురికి మంచిదన్నారు. అనంతరం తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలు తెలిపే వాల్‌పోస్టర్లను ప్రదర్శించారు. కార్యక్రమాల్లో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎం.శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి ఎం.సీతారామారావు, ఎఎస్‌ఎస్‌ఎన్ మూర్తి పాల్గొన్నారు.

**గణపవరం :** పుట్టిన బిడ్డకు ఆరు నెలలపాటు తల్లిపాలు ఇవ్వడం వల్ల బిడ్డకు వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని పిహెచ్‌సి కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్ బాబు అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సోమవారం మూడో సచివాలయం పరిధిలోని అంగన్వాడీ కేంద్రంలో జరిగిన తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. ఏడో తేదీ వరకూ గ్రామాల్లో గర్భిణులు, తల్లులకు ముర్రి పాలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఎన్‌ఎం ఎం.ప్రేమలీల, అంగన్‌వాడీ కార్యకర్త బి.పార్వతి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

**తాడేపల్లిగూడెం :** తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని సోమవారం స్థానిక ఎన్‌టిఆర్ జంక్షన్, యాగర్లపల్లి యుపిహెచ్‌సి వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముర్రిపాల విశిష్టత గురించి యుపిహెచ్‌సి వైద్యులు డాక్టర్ శ్రావ్య, డాక్టర్ తనూజ, గైనకాలజిస్ట్ డాక్టర్ నిహారిక తెలిపారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ విశాలాక్షి, దుర్గ భవాని పాల్గొన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

**పాలకోడేరు:** గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యకరమైన శిశువులు జన్మస్తారని ఐసిడిఎస్ సిడిపిఒ టి.లక్ష్మీకాంతం, శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి అన్నారు. విస్సాకోడేరులోని భీమవరం ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాలు భాగంగా సోమవారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడారు. ఆకుకూరలు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సిబ్బంది, శిశు గృహ సిబ్బంది పాల్గొన్నారు.

**పెనుగొండ :** తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లి ముర్రిపాలు ఇవ్వాలని ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కృష్ణకుమారి అన్నారు. సోమవారం ఎస్‌సి కమిటీ హాల్లో అంగన్వాడీ ఆధ్వర్యంలో కృష్ణకుమారి, ఐసిడిఎస్ అధికారి ఎం.విజయకుమారి మాట్లాడారు. ఆశాలు, అంగన్వాడీలు పాల్గన్నారు.

## రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

**ప్రజాశక్తి - పెనుగొండ**

పేదలకు ఉచిత వైద్యం అందించాలని ఉద్దేశంతో బివి వెంకటరమణ ఛారిటబుల్ ట్రస్ట్ శ్రీకష్ణ దేవరాయలు ఆధ్వర్యంలో ఈ నెల ఏడో తేదీన ములపర్రు గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ ఏలూరు ఆశ్రమ ఆస్పత్రి వైద్యులలు, విష్ణు దంత వైద్యనిపుణులు భీమవరం, కంటి వైద్యులు పాలకొల్లు వారు ఉచితంగా వైద్యం చేస్తారని, అవసరమైన వారికి కళ్లజోళ్లు అందిస్తారని తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 4 గంటల వరకూ శిబిరం కొనసాగుతుందని తెలిపారు.

## దోమల నిర్మూలనపై శ్రద్ధ పెట్టాలి

**పెనుమంట్ర:** దోమల నిర్మూలనపై అందరూ శ్రద్ధ పెట్టాలని జిల్లా మలేరియా ఇన్‌ఛార్జి అధికారి కెజెఎన్.రవికుమార్ అన్నారు. సోమవారం ఆలమూరు గ్రామం ఎస్‌సి కమ్యూనిటీ హాల్ వద్ద ఏర్పాటు చేసిన ప్రథమ చికిత్సా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆశా కార్యకర్తలు ప్రజలు ప్రతి రోజూ డ్రైడేగా పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. ఫిమేల్ టైగర్ దోమ పుట్టుకను లార్వా దశలోనే చెక్ పెట్టాలన్నారు. అనంతరం ఫీల్డ్‌లో చేస్తున్న సర్వేను, పిహెచ్‌సిలో లాబ్ రిజిస్టర్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ వి.అనీల్‌కుమార్, డాక్టర్ కె.ప్రదీప్ కుమార్, సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.